ప్రజాశక్తి
శుక్రవారం 29 ఆగస్టు 2025 5 కర్నూలు

కొత్త జిల్లాగా ఆదోని..?

- పెరుగుతున్న డిమాండ్ - అదే యోచనలో ప్రభుత్వం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా ఆదోనిని జిల్లాగా ఏర్పాటు చేసే అవకాశం కనిపిస్తోంది. ప్రజల నుంచి కూడా అదే డిమాండ్ వ్యక్తం అవుతోంది...

గత వైసిపి ప్రభుత్వ పరిపాలన సౌలభ్యం పేరిట 2022లో ఉమ్మడిగా ఉన్న 13 జిల్లాలను విభజించి 26 జిల్లాలను ఏర్పాటు చేసింది. ఒక పార్లమెంటు ప్రామాణికంగా చేసుకుని ఏర్పాటు చేసిన ఆయా జిల్లాల పరిధిలో కొత్తగా రెవెన్యూ డివిజన్లను సైతం ఏర్పాటు చేశారు. అలా కొత్తగా ఏర్పడిన జిల్లా కేంద్రాల నుంచే పరిపాలన సాగిస్తున్నారు. అందులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో నంద్యాల కొత్త జిల్లాగా ఏర్పడింది. తాజాగా టిడిపి ప్రభుత్వం జిల్లాలను పునర్ విభజించాలని నిర్ణయించింది. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఆయా ప్రాంతాల భౌగోళిక స్వరూపం, సాంస్కృతిక నేపథ్యం, సామాజిక, ఆర్థిక స్థితిగతుల తో పాటు జనాభా ప్రాతిపదికన పరిగణనలోకి తీసుకుని కొత్త జిల్లాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం, వాటిని అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. దీంతో ఆదోనిని జిల్లాగా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ పెద్ద ఎత్తున వ్యక్తం అవుతోంది. ప్రభుత్వం కూడా ఆదోనిని జిల్లా చేయాలని యోచిస్తున్నట్లు తెలిసింది. ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలతో కలిసి ఆదోని జిల్లాను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

మంత్రుల సమావేశం రద్దు

జిల్లా, మండలాలు, గ్రామ సరిహద్దులు, పేర్ల మార్పులకు సంబంధించిన జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం కర్నూలులో సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఆ సమావేశాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు.

నకిలీ ఎపికె ఫైల్స్‌తో ప్రజలు జాగ్రత్త

- ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

నకిలీ ఎపికె ఫైల్స్ లింకులను తొందరపడి క్లిక్ చేయొద్దని జాగ్రత్త వహించాలని కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అన్నారు. ఎపికె ఫైల్స్ పట్ల అనుసరించాల్సిన జాగ్రత్తలను గురించి ఎస్‌పి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సామాజిక మాధ్యమాల్లో ఆర్‌టిఒ ఛలాన్, ట్రాఫిక్, పిఎం కిసాన్, ఎస్‌బిఐ రివార్డ్ ఎపికె పేరుతో వైరల్ అవుతున్నాయన్నారు. ఈ లింక్‌ను క్లిక్ చేసి డౌన్‌లోడ్ చేసుకునే వారి ఫోన్‌లో రహస్య సమాచారాన్ని సైబర్ నేరగాళ్ళు చోరీ చేసే ప్రమాదం ఉందన్నారు. సైబర్ నేరగాళ్ళు ముందుగా ఎపికె ఫైల్ ను పంపుతారని, దానిని నమ్మి ఏమాత్రం ఆలోచించకుండా ఫైల్ ను క్లిక్ చేసి ఇన్‌స్టాల్ చేసుకోవద్దన్నారు. అలా చేస్తే సైబర్ నేరగాళ్ళు మీ ఫోనును రిమోట్ వినియోగించి వెంటనే ....మీ అనుమతి లేకుండా క్రెడిట్ కార్డు నుంచి ఆన్‌లైన్ కొనుగోళ్లు చేస్తారన్నారు. గుర్తు తెలియని, అనధికార లింకులను క్లిక్ చేయొద్దని సూచించారు. యాప్స్ ను ఎల్లప్పుడు గూగుల్ ప్లే స్టోర్ నుండే డౌన్‌లోడ్ చేయాలని, ఒటిపి అలర్ట్స్ ను ఎనేబుల్ చేసుకోవాలన్నారు. ఏవైనా మీ అనుమతి లేకుండా లావాదేవీలు జరిగినట్లు అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే కార్డును బ్లాక్ చేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల ఫిర్యాదు చేయడానికి వెంటనే 1930 కి కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in ద్వారా తెలియజేయాలని జిల్లా ప్రజలకు ఎస్‌పి సూచించారు.

ఎస్‌పి విక్రాంత్ పాటిల్

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌బిఐ మేనేజర్ బి.లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం కర్నూలు పూలబజార్‌లోని ఉర్దూ బాయ్స్ హైస్కూల్లో ఆర్‌బిఐ ఆధ్వర్యంలో డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సొసైటీఫర్‌సోషల్ ట్రాన్స్‌ఫార్మ్ ఆధ్వర్యంలో, ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు పర్యవేక్షణ లో నిర్వహించారు. ఎస్‌బిఐ మేనేజర్ బి.లక్ష్మీనారాయణ, కెడిసిసిబి మేనేజర్ పి శిరీష ప్రోగ్రాం కోఆర్డినేటర్ వి అశోక్ కుమార్, ఇన్చార్జి పాఠశాల హెచ్‌ఎం ఎస్.పుష్పరాజ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్లు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు వై.బాబురావు, ఎస్.నబీరసూల్, ట్రైనర్ వి.పులికొండ, బి.రాముడు నాయక్ పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో మరో విద్యుత్ ఉద్యమం

- విద్యుత్ సంస్కరణలను నిలిపివేయాలి - స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి - కలెక్టరేట్ ఎదుట వామపక్ష పార్టీలు ప్రతిజ్ఞ

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ సంస్కరణలను నిలిపివేయాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలన్నారు. లేకపోతే విద్యుత్ ఉద్యమ అమరవీరుల స్ఫూర్తితో మరో విద్యుత్ ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. 2000 సంవత్సరంలో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన చారిత్రాత్మక ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన సత్యనపల్లి రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి వర్ధంతి సందర్భంగా సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ, ఎస్‌యుసిఐ ల ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ ఎదుట ప్రతిజ్ఞ చేసి, నిరసన తెలిపారు. విద్యుత్ పోరాట అమరవీరులకు వామపక్ష పార్టీల నాయకులు కార్యకర్తలు నివాళులర్పించారు. సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పరిపాలనలో విద్యుత్ సంస్కరణలు వచ్చిన సందర్భంగా దాదాపు ఆరు నెలపాటు విద్యుత్ పోరాటం నిర్వహించారన్నారు. ఆ పోరాటం ఉధృతం కావడానికి కర్నూలు జిల్లానే నాంది పలికిందన్నారు. 2000 జూలై 28న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగిన సభలో చంద్రబాబు ఉపన్యాసాన్ని అడ్డుకుని విద్యుత్ సంస్కరణలో వెనక్కి తీసుకోవాలని మహా ఉద్యమాన్ని చేపట్టామన్నారు. ఆ తర్వాత 2000 ఆగస్టు 28న వేలాదిమంది ప్రజలు అసెంబ్లీ ముట్టడి చేపట్టారని అన్నారు. అప్పుడు దుర్మార్గంగా చంద్రబాబు ప్రభుత్వం బషీర్‌బాగ్ దగ్గర కాల్పులు జరిపి, లాఠీచార్జీ చేసిందన్నారు. రామకృష్ణ వర్ధన్ రెడ్డి, బాలస్వామి అమరులయ్యారన్నారు. తరువాత దాదాపు 15 ఏళ్ల పాటు చంద్ర బాబును అధికారానికి ప్రజలు దూరం పెట్టారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రం విడిపోయిన తర్వాత తొలి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన చంద్రబాబు విద్యుత్ ఉద్యమ జోలికి వెళ్లనని చెప్పాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. మళ్లీ తిరిగి 2017లో ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేయడం మొదలు పెట్టారని ఆరోపించారు. ఆ తర్వాత వచ్చిన జగన్మోహన్‌రెడ్డి పాలనలో కొనసాగించిందని చంద్రబాబు నాయుడు కంటే ఒక అడుగు ముందుకేసి అదానితో సెకీఒప్పందాలు చేసుకొని కొత్తగా స్మార్ట్ మీటర్లు పెట్టే విధానాన్ని తీసుకుని వచ్చాడన్నారు. అందుకోసమే ప్రజలు జగన్మోహన్ రెడ్డిని ఇంటికి పంపించారని వారు ఘాటుగా విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో తండ్రి కొడుకులు చంద్రబాబు లోకేష్ ఇద్దరు కలిసి బాదుడే బాదుడు కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టారని, స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని ప్రజలకు పిలుపునిచ్చిన ఈ మహానుభావులు అధికారం రాగానే ఆరు నెలలలోపే స్మార్ట్ పీటర్లను, ట్రూ ఆఫ్ చార్జీలను తిరిగి ప్రవేశపెట్టారన్నారు. దానివల్ల ఈ 11 నెలల కాలంలో రూ.15 వేల కోట్ల ప్రజలపై భారం మోపారని ఇంతకంటే దుర్మార్గమైన పని మరొకటి ఉండదని ఘాటుగా విమర్శించారు. చంద్రబాబు గత విద్యుత్ ఉద్యమాన్ని మర్చిపోతే శాశ్వతంగా రాజకీయాల నుంచి ప్రజలు దూరం పెట్టాల్సిన కాలం ఎంత దూరంలో లేదని విమర్శించారు. ఇప్పటికైనా ఎన్నికల ముందు తాను ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం స్మార్ట్ మీటర్ల పెట్టే విధానాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. అది చెయ్యకపోతే రాష్ట్రంలో వామపక్షాలు ఇతర రాజకీయ పార్టీలను కలుపుకొని మరో విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు విద్యుత్ ఉద్యమ అమరవీరుల సాక్షిగా మరో విద్యుత్ ఉద్యమాన్ని చేపడతామని ప్రతిజ్ఞ పూనారు. ఎస్‌యుసిఐ నాయకులు నాగన్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్ఐ రాధాకృష్ణ, ఎమ్‌డి.ఆనంద్ బాబు, సిపిఎం జిల్లా నాయకులు గురుశేఖర్, విజయరామాంజనేయులు, సుధాకరప్ప, నరసింహులు, రామకృష్ణ కె.అరుణ సిపిఐ జిల్లా నాయకులు జగన్నాథం, మునెప్ప, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

నిరసననుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

సర్వర్ కష్టాలు

- ఆలస్యంగా డిఎస్‌సి సర్టిఫికెట్ల పరిశీలన
- కొంతమంది సర్టిఫికెట్లు నిరాకరణ
- పర్యవేక్షించిన జెసి, ఆర్‌జెడి, డిఇఒ
- కౌన్సెలింగ్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రెండు రోజుల ఆలస్యం అనంతరం డిఎస్‌సి అభ్యర్థుల సర్టిఫికెట్లు వెరిఫికేషన్ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. సర్టిఫికెట్ల పరిశీలనకు ఉదయం నుండి మధ్యాహ్నం వరకు సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో అభ్యర్థులు విసుగెత్తిపోయారు. సర్వర్ వచ్చినప్పటికీ సరిగ్గా పనిచేయకపోవడంతో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేసేందుకు నిర్వహణ అధికారులు తీవ్ర అవస్థలుపడ్డారు. మరి కొంతమంది అభ్యర్థులు పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిగణలోకి తీసుకోకపోవడంతో నిరాశకి గురయ్యారు. కర్నూలు నగర శివారులోని రాయలసీమ విశ్వవిద్యాలయంలో, శ్రీనివాస బిఇడి కళాశాల, శ్రీ రాఘవేంద్ర డిఈడి కళాశాలలో డిఎస్‌పి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ నిర్వహించారు. దాదాపుగా 250 మంది ఉపాధ్యాయులను 54 బృందాలుగా ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు సంబంధించిన ధృవీకరణ పత్రాల పరిశీలన సమయంలో ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా మధ్యాహ్నం ఒంటిగంట అయినప్పటికీ ప్రారంభం కాలేదు. సర్వర్ ఓపెన్ అయిన అభ్యర్థుల వివరాల పరిశీలనకు మాత్రం ఎక్కువ సమయం పడుతుండడంతో నిర్వహణ అధికారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు మే 15 నాటికి కోర్సు పూర్తి చేసుకున్నప్పటికీ 21న సర్టిఫికెట్లను జారీ చేయడం పట్ల వెరిఫికేషన్ అధికారులు పరిగణలోకి తీసుకోలేదు. ఉపాధ్యాయ సంఘాల నేతలు జోక్యం చేసుకొని రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. మరి కొంతమంది అభ్యర్థులు పోస్టులకు అర్హత ఉన్నప్పటికీ కాల్ లెటర్స్ అందకపోవడంతో వెరిఫికేషన్ కేంద్రాలకు చేరుకున్నారు. తమకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పోస్టులకు ఎంపిక చేయకుండా ఎందుకు విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కేంద్రంలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్‌కుమార్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్‌పాటి, జిల్లా సహాధ్యక్షులు జీవిత, జిల్లా కార్యదర్శులు తిమ్మన్న ,కౌలన్న బాబు ఇలా ప్రతినిధి బృందం పర్యవేక్షించి అభ్యర్థులకు పలు సందేహాలను నివృత్తి చేశారు. మొదటి రోజు పూర్తిస్థాయిలో అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ ముగియపోవడంతో శుక్రవారం కూడా యధావిధిగా నిర్వహిస్తామని, విద్యాశాఖ అధికారులు ప్రకటించారు.

వెరిఫికేషన్ కేంద్రాలను పరిశీలించిన జెసి

డిఎస్‌సి–2025 నిర్వహణలో భాగంగా సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్య సందర్శించారు. విద్యాశాఖ రాష్ట్ర అధికారులు ప్రతాప్‌రెడ్డి, అబ్రహం, కర్నూలు జిల్లా విద్యాధికారి ఎస్ శ్యామ్యూల్, పాల్ నంద్యాల జిల్లా విద్యాధికారి జనార్దన్ రెడ్డిలతో కలసి రాయలసీమ విశ్వవిద్యాలయంలోని ఆరు కేంద్రాలను పరిశీలించారు. వెరిఫికేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. తొలిరోజు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు పాటించాలని ఎప్పటికప్పుడు సమస్యలను అధిగమించి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

డిఎస్‌సి వెరిఫికేషన్‌లో సమస్యలు పరిష్కరించండి: యుటిఎఫ్

డిఎస్‌సి అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్‌పాటి డిమాండ్ చేశారు. డిఎస్‌సి వెరిఫికేషన్ కేంద్రంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య ఆర్‌జెడి ప్రతాపరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ దృష్టికి, యుటిఎఫ్ నేతలు పలు సమస్యలు తీసుకువెళ్లారు. ముఖ్యంగా స్కూల్ అసిస్టెంట్, ఎగ్జిట్‌లో సెలెక్ట్ అయి ఉండి ఆప్షన్ ఇచ్చే విషయంలో కొంత ఇబ్బందులు ఉన్నాయన్నారు. కనుక తిరిగి ఉపాధ్యాయులను ఆప్షన్స్ ఇచ్చే అవకాశం కల్పించమని, సెలెక్ట్ అయి కూడా కాల్ లెటర్స్ రాని అభ్యర్థులు కొంతమంది ఉన్నారన్నారు. ధ్రువీకరణ పత్రాలు సమర్పించడంలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు.

జెసి డాక్టర్ నవ్యతో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు సురేష్ కుమార్, రవికుమార్, నవీన్ పాటి

కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి అంజిబాబు

ఉద్యమాలతోనే హక్కుల సాధన

ప్రజాశక్తి సి బెళగల్

పాలకుల ప్రజావ్యతిరేక విధానాలకు కార్మిక సంఘాలు ఉద్యమాలను ఉధృతం చేయకుంటే హక్కులను ఏమాత్రం సాధించలేమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు పేర్కొన్నారు. గురువారం డివిజన్ నాయకులు మోహన్ సమక్షంలో సి బెళగల్ మండల ప్రజా, కార్మిక సంఘాలతో ఎన్‌టిఆర్ పార్కులో సమీక్షించారు. అంజిబాబు మాట్లాడుతూ ఆదాని, అంబానీలకు , కార్పొరేట్లకు ఊడిగం చేయడానికే బిజెపి కంకణం కట్టుకుందన్నారు. దీంతో ప్రజా సంక్షేమం ఎక్కడికక్కడే కుంటు పడిందన్నారు. నూతన లేబర్ కోడులను అమలు చేసి ఉద్యోగ, కార్మికులకు పని గంటలు పెంచే యోచనతో ప్రభుత్వం ఉందన్నారు. దేశ అభివృద్ధి ఇప్పటికే 20 ఏళ్ళు వెనక్కి వెళ్లిందని గ్రహించాలన్నారు. ఉద్యమ బాట ఉఉధృతం చేస్తే హక్కులను సాధించగలమని, ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. మహాసభ మండల కన్వీనర్ గా ఇబ్రహీం, కో కన్వీనర్లుగా మంగమ్మ, అనంతమ్మ, సుంకన్న, సుందరాజు, వెంకట్రాముడు లు పాల్గొన్నారు.

బిర్లా ఓపెన్ పెయింట్స్ షాపును ప్రారంభిస్తున్న ఎ.వన్ కాంట్రాక్టర్ పల్లెప్రభాకర్‌రెడ్డి

రంగుల ప్రపంచ రారాజు బిర్లా ఓపెస్ పెయింట్స్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రంగుల ప్రపంచం రారాజుగా బిర్లా ఓపెస్ పెయింట్స్ నిలుస్తాయని ఏ వన్ కాంట్రాక్టర్ పల్లెప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం కర్నూలు నగరం బళ్లారి చౌరస్తా వర్మ కాంప్లెక్స్‌లో సప్తగిరి ఎంటర్‌ప్రైజెస్ వారి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బిర్లా ఓపస్ పెయింట్స్ షాపును రిబ్బన్ కత్తిరించి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... నాగరికత సాంకేతికత పెరుగుతున్న ఈ రోజుల్లో ప్రజలు సరికొత్త అభిరుచుల వైపు పయనిస్తున్నారన్నారు. అందుకు అనుగుణంగా సప్తగిరి ఎంటర్‌ప్రైజెస్ వారి ఆధ్వ ర్యంలో సప్తగిరి మార్కెటింగ్ ప్రొప్రైటర్ కెవి సుబ్బారెడ్డి ఆధునిక సాంకే తికతో ప్రజల అభిరుచులకు అద్దం పట్టేలా బిర్లా ఓపస్ పెయింట్స్ ను నగరానికి పరిచయం చేయడం అభినందనీయమన్నారు. సంస్థ దినదినాభివృద్ధి చెందాలని ఆ కాంక్షించారు. ప్రొప్రైటర్ కెవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ... తమ షాపులో అన్ని రకాల ఆధునిక టెక్నాలజీ తో కూడిన పెయింటింగ్ మిషన్లు ఏర్పాటు చేశామన్నారు. వీటితో ప్రజలకు ఇష్టమైన అన్నిరకాల పెయింట్ రంగులను నాణ్యతలో రాజీలేకుండా సరసమైన ధరలకే అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

పార్కుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

పలు కాలనీలలో పార్కుల పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని పలు కాలనీలలో అభివృద్ధికి నోచని పార్కులను పరిశీలించి, తక్షణ చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన నగరంలోని వివిధ ప్రాంతాల పార్కులను పరిశీలించారు. సిక్యాంప్ ఇఎల్ఎస్ఆర్ ట్యాంక్ పార్క్, మద్దూరి నగర్ పార్క్, బిర్లాకాంపౌండ్ పార్క్, వీనస్ కాలనీ పార్క్–2 (ఖేలో ఇండియా), ప్రేంనగర్ పార్క్, ఆయుష్మాన్ హాస్పిటల్ ప్రాంగణం, మున్సిపల్ ఎంప్లాయీస్ కాలనీపార్క్, ఎల్ఐసికాలనీ పార్క్‌లను కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులను సమర్థవంతంగా వినియోగించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. నగరపాలక సాధారణ నిధులు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సియస్ఆర్) ఫండ్స్, పబ్లిక్–ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) నిధులతో ఆరు పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్‌క్యాప్ నిధులతో నూతన డివైడర్లపై పచ్చదనం పెంపు పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. పౌరులు విహరించడానికి, పిల్లలు ఆడుకోవడానికి అనువుగా పార్కులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పార్కుల్లో పచ్చదనం పెంపు, కూర్చునే సదుపాయాలు, లైటింగ్, శుభ్రత వంటి అంశాలపై అధికారులు మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. ఎస్ఇ. శేషసాయి, ఎంఇ మనోహర్ రెడ్డి, హార్టికల్చర్ ఎడి విజయలక్ష్మి, డిఇలు గంగాధర్, క్రిష్ణలత, గిరిరాజ్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, ఎఇభాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లిం మైనారిటీ మహిళలకు చేయూత

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ సహకారంతో మహమ్మదీయ వక్ఫ్ కాంప్లెక్స్ కేర్ కమిటీ, కర్నూలు వారి ఆధ్వర్యంలో స్టేట్ హజ్ కమిటీ సభ్యులు సూరిమన్సూర్ అలీఖాన్ తొమ్మిది మంది పేద ముస్లిం మైనారిటీ మహిళలకు రూ.3000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సూరి మన్సూర్ అలీ ఖాన్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని, మహమ్మదీయ వక్ఫ్ కాంప్లెక్స్ కేర్ కమిటీ నూతనంగా ఏర్పడిన అతి తక్కువ సమయంలోనే పేద ముస్లిం మైనారిటీ మహిళలకు నేడు ఆర్థిక సాయం అందజేయడం, అంతకముందు బాడీ ఫ్రీజర్లు అందజేయడం హర్షించదగిన విషయమన్నారు. ఇందుకు కృషి చేసిన కమిటీ సభ్యులను అభినందించారు. త్వరలోనే ఈ సహాయాన్ని పెంచుతూ రూ.5000 చేయడం కోసం మంత్రి టిజి భరత్ సహకారంతో రాష్ట్ర కార్యాలయానికి ప్రపోజల్ పంపినట్లు తెలిపారు. భవిష్యత్తులో మహమ్మదీయ వక్ఫ్ కాంప్లెక్స్ కేర్ కమిటీ మైనార్టీ సమాజం కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. కమిటీ అధ్యక్షులు ఇబ్రహీం, సభ్యులు మున్నాఫ్, రమ్మీ మహబూబ్, మైనారిటీ మహిళలు పాల్గొన్నారు.

పేద ముస్లిం మహిళకు ఆర్థికసాయం ఇస్తున్న అలీఖాన్

కలెక్టర్ ఆదేశాలతో రోడ్డుకు మహర్దశ

-నిర్మాణానికి కొలతలేసిన పంచాయతీ రాజ్ ఇంజనీర్లు
-కలెక్టర్‌కు పిపిఎస్ఎస్ నాయకుల అభినందన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మానసిక వికలాంగుల పాఠశాల, అనాథ పిల్లల ఆశ్రమం, శ్రీ నిలయం, టిజి నగర్ మీదుగా ఆర్‌టిఒ ఆఫీసు, శివాలయం వెళ్లే జగన్నాథం గట్టు రోడ్డు నిర్లక్ష్యానికి గురై అడుగు తీసి అడుగు పెట్టలేని పరిస్థితి ఏర్పడిందని స్థానిక ప్రజల తో కలిసి పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం గ్రీవెన్స్‌లో కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ ఖలీల్, మధుల ఆ ప్రాంతంలో పర్యటించి రోడ్డునిర్మాణానికి కొలతలు వేశారు. వెంటనే స్పందించినందుకు స్థానిక మహిళలు కె శ్రీదేవి, జి మౌనిక, కె అంజిత, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలుకు ముఖద్వారంలో జి.పుల్లారెడ్డి కాలేజీ పక్కన ఎంతో ప్రాధాన్యత కలిగిన రోడ్డు శిథిలమైనా ఇంతవరకు ఎవరూ పట్టించుకోవడంలేదన్నారు. ప్రతిరోజు వృద్ధులు స్కూల్ పిల్లలు మహిళలు బురదలో నడవలేక కిందపడుతున్నారు. కొందరు ఆసుపత్రుల పాలయ్యారని.. వెంటనే సిమెంట్ రోడ్డు, కాలువలు నిర్మించాలని ఇంజనీర్లను వేడుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోడ్డును కొలతలు తీసుకున్నామని వెంటనే రోడ్డు కాలువలుకు అంచనా వేసి పంపిస్తామని ఇంజనీర్లు తెలిపారు. స్థానిక మహిళలతో పాటు జి హర్షవర్ధన్ రెడ్డి, మహమ్మద్ యూనూస్, సివి వర్మ,టి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

నిర్మాణానికి కొలతలేస్తున్న పంచాయతీ రాజ్ ఇంజనీర్లు

కల్లూరు తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

తిలక్‌నగర్ కొట్టాలకు పట్టాలివ్వాలి

కల్లూరు తహశీల్దార్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

జీవో నెంబర్ 30 ప్రకారం కర్నూలు నగరంలోని 42వ వార్డు కల్లూరు మండల పరిధిలోని ఎస్‌ఎపి క్యాంప్ ఎదురుగా ఉన్న బాలగంగాధర్ తిలక్ నగర్‌లో50 ఏళ్ల నుండి నివాసముంటున్న పేదలందరికీ ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరుతూ తిలక్ నగర్ పట్టాల సాధన సమితి ఆధ్వర్యంలో కల్లూరు మండల కార్యాలయం ముందు సి.చలపతి అధ్యక్షతన ధర్నా చేశారు.కల్లూరు మం డలం తహశీల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం అం దించారు. సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు, జిల్లా నాయకులు నగేష్, మహిళా సంఘం నాయకులు జె.కిరణ్మయి మాట్లాడారు. 50 ఏళ్ల నుంచి తిలక్ నగర్ లో నివాసం ఉంటున్న పేదలందరికీ జీవో నెంబర్ 30 ప్రకారం ఇంటి పట్టా ఇ వ్వాలని డిమాండ్ చేశారు. వారందరికీ కరెంటు బిల్లులు, ఇంటి పన్ను రసీదులు, ఆధార్ కార్డులు అదే అడ్రస్‌పై ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం తెచ్చిన జిఒ నెంబర్ 30 ప్రకారం తిలక్ నగర్లో 160 కుటుంబాలకు తహశీల్దార్ వెంటనే పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కలెక్టరేట్ ఎదుట, మంత్రి ఇంటి ముందు బాధితులతో కూ ర్చుంటామని హెచ్చరించారు. తిలక్ నగర్ పట్టాల సాధన కమిటీ సభ్యులు మురళి, కృష్ణ, వెంకటేశ్వర్లు (డిస్కో) రమేష్, మల్లికార్జున, సిద్ధప్ప, పురుషోత్తం, వెంకటేశ్వరమ్మ, వెంకట లక్ష్మమ్మ, శకుంతల మునెమ్మ, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

పథకాలుసాధించినక్రీడాకారులతో సౌమ్యగోపినాథ్,ప్రిన్సిపల్ రాజ్‌కమల్, తదితరులు

తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : రిడ్జ్ పాఠశాల విద్యార్థులు సిబిఎస్‌సి సౌత్‌జోన్–1 తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఈనెల 21 నుండి 24 వరకు ప్రకాశం జిల్లా మార్కాపురంలోని కమలా స్కూల్లో జరిగిన ఈ పోటీలలో 1 బంగారు పతకం, 3 రజత పతకాలు, 1 కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. పతకాలు పొందిన విద్యార్థులు వరుసగా యశ్వంత్‌రెడ్డి, కీర్తి, భరత్, శివ, విఘ్నేష్ రెడ్డి, స్నికిత పతకాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల సిఇఒ గోపీనాథ్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కో సిఇఒ సౌమ్యగోపీనాథ్, డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపల్ రాజ్‌కమల్ , ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఈ ఘనతకు కారకులైన తైక్వాండో మాస్టర్ సుందర్రాజును పాఠశాల యాజమాన్యం వారు ప్రత్యేకంగా అభినందించారు.

సకాలంలో విగ్రహాలు తరలించాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో ఆదివారం జరిగే గణేష్ నిమజ్జన శోభా యాత్ర ఉదయం ప్రారంభించి చీకటి పడేలోపు పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. గురువారం పట్టణంలోని గణేష్ సర్కిల్, బంగారు బజార్, ఎల్‌బి స్ట్రీట్, ఆర్ట్స్ కళాశాల రోడ్డు ప్రాంతాల్లో శోభ యాత్ర జరిగే రూట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలో సుమారు 500 వినాయక ప్రతిమలు నెలకొల్పినట్లు తెలిసిందన్నారు. పండగ ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. వినాయక ఘాట్ సమీపంలో సంబంధిత అధికారులతో నిమజ్జనానికి సంబంధించిన పనుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. డీఎస్పీ హేమలత, తహశీల్దార్ రమేష్, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, ఆర్అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మనాభ రెడ్డి ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్యమందించాలి : వాతావరణంలో చోటుచేసుకున్న ప్రతికూల పరిస్థితుల వల్ల సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, జాగ్రత్తలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. పట్టణంలోని ఇందిరానగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ప్రభుత్వాస్పత్రిని సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. దగ్గు, జలుబు, జ్వరము వంటి లక్షణాలతో ఆస్పత్రిలో చేరే వారి సంఖ్య ఎక్కువగా ఉందని డాక్టర్ పద్మ కుమార్ వివరించారు. ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన మందులు, మెరుగైన వైద్యం అందించాలని సబ్ కలెక్టర్ సూచించారు. కాచి వడబోసిన నీటిని తాగాలని సబ్ కలెక్టర్ ప్రజలకు సూచించారు.

హంద్రీనీవా నుంచి సాగునీరివ్వాలి

- రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ప్రజాశక్తి- దేవనకొండ

హంద్రీనీవా కాలువ నుంచి మండలంలోని అన్ని గ్రామాల రైతులకు సాగునీరందించాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ కోరారు. బుధవారం మండలంలోని తెర్నేకల్ గ్రామంలో సమావేశం నిర్వహించారు. రైతు సంఘం మండల అధ్యక్షులు బడేసాబ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం చెందిందని తెలిపారు. రైతులకు సరిపడే ఎరువులు, పురుగు మందులు ఇవ్వలేకపోయిందని మండిపడ్డారు. యూరియా కొంతమంది అధికార పార్టీ నాయకులకే పోతుందని, సామాన్య రైతులకు అందడం లేదని విమర్శించారు. అందరికీ అందేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉల్లి పంటకు ధర లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని, క్వింటాకు రూ.400 నుంచి రూ.800లే ఇస్తున్నారని, ఇది అన్యాయమని విమర్శించారు. క్వింటాకు రూ.2 వేలకు తగ్గకుండా ఇస్తేనే రైతులకు కొంత మేరకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం విధానాన్ని మార్చుకోవాలని కోరారు. మండల కార్యదర్శి కోటకొండ సూరి మాట్లాడుతూ... హంద్రీనీవా కాలువకు గుండ్లకొండ దగ్గర స్లూయిజ్ ఏర్పాటు చేసి కోటకొండ వరకు సాగునీరు ఇవ్వాలని కోరారు. కరివేముల-తెర్నేకల్ మధ్యలో ఉన్న కాలువల పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం సీనియర్ నాయకులు శ్రీరాములు, బజారి, మహబూబ్ బాష, ఎపి.రాముడు, మార్కండేయులు, శ్రీనివాసులు, లక్ష్మీ రెడ్డి, సుధాకర్, రవి, అస్లాం బాష, సుంకన్న, కౌలుట్లయ్య పాల్గొన్నారు.

నిజాలను నిర్భయంగా రాయాలి

- ఎమ్మెల్సీ బీటీ.నాయుడు

ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ బీటీ

ప్రజాశక్తి - ఆదోని

సమాజంలో జరుగుతున్న లోటుపాట్లను ఎత్తిచూపుతో నిజాలను నిర్భయంగా పత్రికలు ప్రచురించాలని ఎమ్మెల్సీ బీటీ.నాయుడు తెలిపారు. గురువారం ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్పష్టమైన సమాచారం ప్రజలకు చేరవేసినప్పుడే ఆ పత్రిక పట్ల నమ్మకం కలుగుతుందన్నారు. లాభాపేక్ష ఆశించకుండా నిజాలను నిర్భయంగా స్పష్టమైన సమాచారాన్ని ప్రచురించాలని తెలిపారు. ప్రజాశక్తి దినపత్రిక ప్రజల పక్షాన నిలిచి పని చేస్తోందని కొనియాడారు. నాయకులు నాగరాజ్, ఆదోని డివిజన్ ఇన్‌ఛార్జ్ చంద్రశేఖర్, విలేకరి మునెప్ప ఉన్నారు.

ఉల్లి ధర పతనం

- రైతు కంట కన్నీరు - గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

ఉల్లి పంటను గ్రేడింగ్ చేస్తున్న కప్పట్రాళ్ల రైతులు

ప్రజాశక్తి- దేవనకొండ

ఉల్లి పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ఉల్లి రైతుల కంట కన్నీరే మిగిలింది. గత మూడేళ్లుగా ఉల్లి పంటకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలతో ఓవైపు, అధిక వర్షాలతో రైతులు అల్లాడుతున్నారు. కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

ఉల్లికి మార్కెట్‌లో క్వింటా కేవలం రూ.400 నుంచి రూ.800లోపు ధర లభిస్తుండంతో పంటల కోసం పెట్టిన పెట్టుబడులు సైతం రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పి.కోటకొండ, కప్పట్రాళ్ల, అలారుదిన్నె, ఈదుల దేవరబండ, బంటుపల్లి, బేతపల్లి, బండపల్లి, దేవనకొండ, పల్లెదొడ్డి, వెంకటాపురం, గుండ్లకొండ తదితర గ్రామాల్లో ఉల్లి పంటను రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం మండలంలో 4 వేల ఎకరాల్లో ఉల్లి పంటను రైతులు సాగు చేశారు. ఒక ఎకరా ఉల్లి పంట సాగుకు పొలం దున్నకాలు, ఉల్లి విత్తనం నాటు వేయడం, కలుపులు, రసాయనిక, క్రిమిసంహార మందులు, ఉల్లి పంట కోతకు పెట్టుబడి రూ.లక్ష దాకా అవుతుంది. పంట ఉత్పత్తులను కర్నూలు, హైదరాబాదు, తాడేపల్లిగూడెం మార్కెట్లకు తరలిస్తారు. పంట దిగుబడి 80 నుంచి 100 కింటాళ్ల వరకు వస్తుంది. మార్కెట్‌లో క్వింటా ఉల్లి రూ.400 నుంచి రూ.800 ధర పలుకుతుండడంతో పెట్టుబడి కూడా రావడం లేదు. ప్రభుత్వాలు ఉల్లి పంటకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ఘోరంగా విఫలమైనట్లు రైతులు వాపోతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

- కౌలుట్లయ్య, కప్పట్రాళ్ల రైతు

పాలక ప్రభుత్వాలు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర నిర్ణయించినప్పుడే రైతులు నష్టపోరు. గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. పంట దిగుబడి వచ్చినప్పుడు ధరలు లేకపోవడంతో కష్టం రైతుల కష్టం వృథా అవుతోంది.

పెట్టుబడి కూడా రావడం లేదు

- రంగన్న, కప్పట్రాళ్ల రైతు

పండించిన ఉల్లి పంటకు మార్కెట్లో గిట్టుబాటు ధర లేకపోవడంతో పంట దిగుబడులకు పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదు. పంటల కోసం తెచ్చిన అప్పులు పేరుకుపోతున్నాయి. ఉల్లి పంట క్వింటా రూ.2 వేలు దాకా మార్కెట్లో ధర నిర్ణయించాలి.

తల్లి లాంటి భూములిచ్చేది లేదు

- మనేకుర్తి గ్రామ రైతులు

ప్రజాశక్తి -ఆలూరు

తల్లి లాంటి సాగు భూములను పవర్ గ్రిడ్ నిర్మాణానికి ఇవ్వబోమని, భూములిస్తే ప్రజలు గ్రామం ఖాళీ చేసి పోవాల్సిందేనని మనేకుర్తి గ్రామ రైతులు తెలిపారు. గురువారం మనేకుర్తి గ్రామంలో ఆర్‌డిఒ భరత్ నాయక్, తహశీల్దార్ శోభ సువర్ణ ప్రజా అభిప్రాయ సేకరణ చేపట్టారు. రైతులు మాట్లాడుతూ... గ్రామంలోని పచ్చని పంట పొలాలను పవర్ గ్రిడ్ నిర్మాణానికి మనేకుర్తి, హులేబీడు, కమ్మర చేడు రెవెన్యూ పరిధిలో 191.76 ఎకరాలను 76 మంది రైతుల నుంచి సేకరించేందుకు ప్రభుత్వం పూనుకుందని తెలిపారు. పంట పొలాలపై ఆధారపడి జీవిస్తున్న తమకు గత 4 నెలలుగా పవర్ గ్రిడ్ అధికారులు నోటీసులు, పత్రిక ప్రకటన ఎలా ఇస్తారని ప్రశ్నించారు. రైతుల అభిప్రాయం తీసుకోకుండా పవర్ గ్రిడ్ కంపెనీ, ప్రభుత్వ అధికారులు కుమ్మక్కయి తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. సారవంతమైన భూములను లాక్కొని తమ కడుపులు కొట్టొద్దని, తమ పిల్లల జీవితాలు కూడా నాశనం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌డిఒ భరత్ నాయక్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాలతో ప్రజా ప్రయోజనార్థం పవర్ గ్రిడ్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. నిర్మాణానికి స్వచ్ఛందంగా భూములిస్తే పవర్ గ్రిడ్ కంపెనీ ఎకరాకు రూ.18 లక్షలు ఇస్తుందని, లేకపోతే జనరల్ యాక్ట్ కింద కోర్టు ద్వారా రూ.6 లక్షలు ఇస్తుందని తెలిపారు. ప్రభుత్వ అధికారులు రైతుల మొర ఆలకించకుండా.. రైతుల పక్షాన నిలబడకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని రైతులు కోపోద్రిక్తులయ్యారు. రైతులు తమ భూములను పవర్ గ్రిడ్ నిర్మాణానికి ఇవ్వమని సంతకాల సేకరణ చేపట్టి, ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. ఆర్ఐ బసన్న గౌడ్, సిఐలు రవి శంకర్ రెడ్డి, గంగాధర్, ఎస్ఐలు ప్రదీప్ కుమార్, మహబూబ్ బాష, శ్రీనివాసులు, మారుతి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు, రైతులు

భూములను పవర్ గ్రిడ్‌కు అప్పగిస్తే ఊరుకోం : రైతు సంఘం

మనేకుర్తి, కమ్మరచేడు, హులేబీడు గ్రామాల్లో రైతుల భూములను పవర్ గ్రిడ్ కంపెనీకి అప్పగిస్తే ఊరుకునేది లేదని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమంతు, మండల కార్యదర్శి యు.ఈరన్న, సిపిఐ జిల్లా నాయకులు భూపేష్ హెచ్చరించారు. ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... గత నాలుగు నెలల నుంచి పవర్ గ్రిడ్ కంపెనీ అధికారులు రైతుల అనుమతి లేకుండా నోటీసులు, పత్రిక ప్రకటన ఇచ్చి భూముల్లో పవర్ గ్రిడ్ నిర్మాణం చేపడతామని రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈనెల 12న మనేకుర్తి గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణకు తహశీల్దార్ రాగా భూములు ఇవ్వబోమని రైతులు తేల్చి చెప్పారని గుర్తు చేశారు. రైతులపై కనికరం లేకుండా ఆర్‌డిఒ భరత్ నాయక్ పవర్ గ్రిడ్ కంపెనీకి అనుకూలంగా... రైతులకు వ్యతిరేకంగా మాట్లాడడం బాధాకరమని విమర్శించారు. భూములిస్తే సరి.. లేదంటే బలవంతంగా రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగించి భూములు లాక్కుంటామని బహిరంగ వేదికలో చెప్పడం దుర్మార్గమని మండిపడ్డారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామంలో 80 శాతం మంది రైతులు ఒప్పుకుంటేనే భూసేకరణ చేయాలని, లేకపోతే అవకాశం లేదని తెలిపారు. రైతుసంఘం నాయకులు రామాంజనేయులు, రంగన్న, బాష, పరమేష్ రెడ్డి, సిద్ధ లింగ పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు స్ఫూర్తి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

ప్రజాశక్తి - ఆదోని

విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకిస్తూ చేపట్టిన ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో మరో ఉద్యమానికి సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు కోరారు. అమరవీరులను స్మరించుకుంటూ పట్టణంలోని భీమాస్ సర్కిల్‌లో ప్రతిజ్ఞ చేసి, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశులు, సిపిఐ పట్టణ కార్యదర్శి టి.వీరేష్, సిపిఎం నాయకులు లక్ష్మన్న, లింగన్న, గోపాల్, సిపిఐ ఎంఎల్ నాయకులు మల్లికార్జున, ఐఎఫ్‌టియు నాయకులు ఎంకప్ప మాట్లాడారు. 2000వ సంవత్సరంలో విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా ప్రదర్శన చేపట్టారని, వామపక్ష, కాంగ్రెస్‌లు ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'చలో అసెంబ్లీ' ప్రకటిస్తే బషీర్‌బాగ్ వద్ద కాల్పులు జరిపి ముగ్గురు ప్రాణాలు బలిగొన్నారని విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా అప్పట్లో భారీ ఉద్యమం సాగిందని తెలిపారు. పెంచిన విద్యుత్ చార్జీలు, ట్రూ అప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు తదితర ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడతామని ప్రతిజ్ఞ చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.సుదర్శన్, ప్రగతి శీల మహిళా సమాఖ్య నాయకులు మన్నెమ్మ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు అజయ్ బాబు, డిహెచ్‌పిఎస్ నియోజకవర్గ కార్యదర్శి ఎ.విజయ్ కుమార్ మాట్లాడారు. సెల్ ఫోన్ తరహాలో విద్యుత్ మీటర్‌కు ముందుగానే డబ్బులు చెల్లించి రీచార్జ్ చేయించుకోవాలన్నారు. నాయకులు వీరేష్, వీరారెడ్డి, లక్ష్మీనారాయణ, నాగరాజ్ ఉన్నారు. **ఆలూరు** గెస్ట్ హౌస్ నుంచి సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో వామపక్ష నాయకులు ర్యాలీగా అంబేద్కర్ సర్కిల్‌కు వెళ్లి విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా.. ప్రజలపై విద్యుత్ భారాలు వేస్తే పోరాడతామని ప్రతిజ్ఞ చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి, సిపిఐ జిల్లా నాయకులు భూపేష్, సిపిఎం మండల నాయకులు మైనా, ఈశ్వర్ గౌడ్, విఠల్, ఆటో యూనియన్ నాయకులు శ్రీనివాసులు, సద్దాం, ఈరన్న, సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, రంగన్న, బాష పాల్గొన్నారు. **ఎమ్మిగనూరులో** వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పంపన గౌడ్ అధ్యక్షతన ప్రతిజ్ఞ దినం నిర్వహించారు. వామపక్ష నాయకులు పి.గోవిందు, రాజు, రంగన్న, కార్మిక సంఘాల నాయకులు రాముడు, తిమ్మ గురుడు, ప్రసాద్, నాయకులు అబ్దుల్లా, లక్ష్మీ నరసయ్య, సురేష్, కృష్ణ, కాళప్ప, వీరేష్, మాలిక్, శ్రీరాములు, జబ్బార్, రాజీవ్, మోజెస్, రవి పాల్గొన్నారు. **ఆస్పరిలో** సిపిఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అమరుల చిత్రపటాలకు సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ, మండల కార్యదర్శి వర్గ సభ్యులు రంగస్వామి, రామాంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి, సహాయ కార్యదర్శి కృష్ణమూర్తి వేర్వేరుగా నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు. సిపిఎం నాయకులు మల్లేష్, శేఖర్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తరుణ్, ఆటో యూనియన్ నాయకులు కుమార్, శీనప్ప, నాగేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి హనుమంతు, రైతుసంఘం మండల కార్యదర్శి బడే సాబ్, సిపిఐ నాయకులు రామాంజిని, గోవిందు, పాండు పాల్గొన్నారు. **కోసిగి** ఆర్‌టిసి బస్టాండ్‌లో వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. సిపిఐ మండల కార్యదర్శి గోపాల్ అధ్యక్షత వహించారు. సిపిఎం మండల కార్యదర్శి రాముడు, రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్, సిపిఐ, సిపిఎం నాయకులు తాయన్న, ఓంకార స్వామి, రామకోటి, హనుమంతు, ప్రకాష్, గోపాల్, ఈరన్న, ఈరన్న, మహాదేవ్, నాగన్న, ఆటో యూనియన్ నాయకులు మురళీ, బి.ఎల్లయ్య, బి.తాయన్న, రవికుమార్ పాల్గొన్నారు.

ఆదోనిలో మాట్లాడుతున్న నాయకులు

ఆలూరులో..

ఎమ్మిగనూరులో

పాము కాటుకు గురై వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నందవరం

పాము కాటుకు గురై ఆంజనేయులు అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన నందవరం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ కేశవ్ వివరాల మేరకు... రాజోలి ఆంజనేయులు (37) ఈనెల 25న తన పొలం గట్టున గడ్డి కోస్తుండగా పాము కాటుకు గురయ్యారు. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక 27న మృతి చెందారు. మృతుని తండ్రి చిన్న తిమ్మప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆంజనేయులు అందరితో స్నేహభావంతో ఉండేవారని, ఆయన మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందని వీధి ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. భార్య శివమ్మ, కుమార్తె మల్లిక, కుమారుడు భీమశేఖర్ ఉన్నారు.

మహిళ మృతి

ఆలూరు : మండలంలోని కమ్మరచేడు గ్రామంలో పాము కాటుకు గురయి కురువ మంగమ్మ (45) మృతి చెందారు. కౌలుకు తీసుకున్న పత్తి పొలంలో ఎరువు చల్లుతుండగా పాము కాటేసింది. ఆమె భర్త మహానంది ఆదోని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మృతురాలికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నేడు టమోటా, కూరగాయల మార్కెట్ వేలం

- పంచాయతీ కార్యదర్శి విజయరాజు

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి కూరగాయల మార్కెట్ వేలాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి విజయ రాజు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. 2025-26 సంవత్సరం టమోటా, కూరగాయల మార్కెట్ బహిరంగ వేలం పాత పంచాయతీ కార్యాలయం ఆవరణంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వేలం పాటలో పాల్గొనే పాటదారులు ఆస్పరి గ్రామవాసులై ఉండాలని, పక్క గ్రామాల వారు వేలంలో పాల్గొనరాదని సూచించారు. రూ.5 లక్షల సాల్వేషన్ సర్టిఫికెట్ తీసుకొని, రూ.2 లక్షలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

పిచ్చి కుక్క స్వైరవిహారం

- ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి -ఆలూరు

ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామంలో పిచ్చి కుక్క దాడిలో ఆరుగురికి గాయాలయ్యాయి. రెండు పశువులు గాయపడ్డాయి. గురువారం ఉదయం పిచ్చి కుక్క దాడిలో గాయపడిన వారిని గ్రామస్తులు ఆలూరు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. మస్తాన్ సాబ్, షేక్షావలీ, నబి, గౌతమ్, రమిజా, ఒక ఆవు, పొట్టేలు గాయపడినట్లు తెలిపారు. గ్రామాల్లో కుక్కలు, వీధి పశువుల వల్ల ప్రజలు గాయాల పాలై మృతి చెందుతున్నా అధికారులు స్పందించడం లేదని మండిపడుతున్నారు. కుక్కలు, వీధి పశువుల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా వినాయక చవితి వేడుకలు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని అన్ని గ్రామాల్లోనూ వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం చిప్పగిరిలోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ఎస్ఆర్ బాయ్స్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదట వేద పండితులతో స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండగలో భాగంగా గురువారం భక్తులకు, గ్రామస్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. **మంత్రాలయం** మండలంలోని అన్ని గ్రామాల్లోనూ వినాయక భక్త బృందాలు ప్రత్యేక మండపాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. శ్రీమఠంలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు విఘ్నేశ్వరునికి నైవేద్య సమర్పణతో మంగళ హారతులిచ్చారు. పాత ఊరు, సంత మార్కెట్, తుంగభద్ర నదీతీరంలో, సుజయీంద్ర నగర్, స్టేట్ బ్యాంక్ వద్ద, లాడ్జింగ్ ఏరియా, రామచంద్ర నగర్, పరిమళ విద్యానికేతన్ వద్ద ఉన్న శ్రీమఠం ఉద్యోగుల కాలనీ, రాఘవేంద్ర నగర్ కాలనీలోని వీధుల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. మంత్రాలయంలో కొలువైన గణనాథులను వైసిపి, టిడిపి నాయకులు దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. బుధవారం రాత్రి టిడిపి యువ నాయకులు ఎన్.రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, గురువారం వైసిపి నాయకులు వై.సీతారామిరెడ్డి దర్శించుకున్నారు. వారికి నిర్వాహకులు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. సీతారామిరెడ్డి నిర్వాహకులకు రూ.5 వేల చొప్పున విరాళం అందించారు. సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి వెంకటేష్, వార్డు సభ్యులు వీరారెడ్డి, మాజీ ఉప సర్పంచి గోర్కల్ కృష్ణస్వామి, నాయకులు వికెసి.రఘు, పి.రాము, టిడిపి పట్టణ ఇన్‌ఛార్జ్ బి.వరదరాజులు, ఎంపిటిసి మేకల వెంకటేష్, టిడిపి నాయకులు పవన్ కుమార్, కె.నరసింహ, రమేష్, టైగర్ రఘు, డేవిడ్, రాజు, శివ పాల్గొన్నారు. **ఆస్పరి** మండలంలోని ఆస్పరి, శంకరబండ, జొహరాపురం, చిన్నహోతూరు, తంగరడోన, బిల్లేకల్లు, కారుమంచి, కైరుప్పల, హాలిగేర, ములుగుందం, బిణిగేరి, చిరుమాన్ దొడ్డి గ్రామాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం నిమజ్జనం జరుగుతుందని నిర్వాహకులు హేమంత్, వీరశేఖర్ రెడ్డి, లక్ష్మన్న, వీరేష్, వీరశేఖర్, నాగరాజు, అశోక్, రమేష్, మహేంద్ర, మల్లి తెలిపారు. **దేవనకొండ** మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. దేవనకొండలో రాయల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి వైకుంఠం జ్యోతి, టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, ఉచ్చీరప్ప, రామారావు నాయుడు, రాజశేఖర్ గౌడ్, నాగరాజు గౌడ్, మల్లేపల్లి రంగడు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిప్పగిరిలో పాల్గొన్న ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి

కర్నూలులో వన్ టౌన్ చిత్తారి వీధి మాల గేరిలో వినాయకుడు


కమిషనర్‌తో మాట్లాడుతున్న గుడిసె ఆది కృష్ణమ్మ

రాయనగర్‌లో మహిళల అవస్థలు

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

పట్టణ శివారులో ఉన్న రాయనగర్‌లో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు చూడలేకపోతున్నామని, సత్వరమే పరిష్కారం చూపాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. గురువారం ఆదోని మున్సిపల్ కమిషనర్ కృష్ణ, మున్సిపల్ ఇంజినీర్ సత్యనారాయణను కలిసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వ్యక్తిగత మరుగుదొడ్లు లేకపోవడంతో అవసరాలు తీర్చుకునేందుకు పొదల చాటున, ముళ్ల కంపల్లోకి వెళ్తున్నారన్నారు. ఇటీవల మురుగు కాలువ వెడల్పు చేయడం వల్ల అవతలకు దాటేందుకు అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వంక దాటేందుకు వంతెన ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్లు మంజూరు చేసి నిర్మించాలని కోరారు. కల్లుబావి వీధిలోని వాల్మీకి విగ్రహం వద్ద వంక పూడిక నిలిచి దుర్వాసన వస్తోందని, పనులు చేపట్టాలని తెలిపారు. రాయ నగర్ వంకపై వంతెన నిర్మాణం చేపట్టకపోతే తానే సొంతంగా ఏర్పాటు చేయిస్తానని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. స్పందించిన అధికారులు త్వరలోనే పనులు మొదలు పెట్టిస్తామన్నారు. టిడిపి నాయకులు మురళీ, హరి ఉన్నారు.

నీటి వృథాను అరికట్టడంలో నిర్లక్ష్యం

ప్రజాశక్తి - నందవరం

గ్రామంలో నీటి వృథాను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వర్షాకాలం వచ్చినా పలు వీధుల్లో నీటి ఎద్దడి ఉంది. కొన్నిచోట్ల పైపులు డ్యామేజ్ అయి నీరు వృథాగా పోతున్నాయి. నీటి ఎద్దడిని పరిష్కరించడంలోనూ, నీటి వృథాను అరికట్టడంలోనూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గ్రామంలో అధికారులు ఉన్నారా కార్యాలయాల్లో నిద్రిస్తున్నారనే విధంగా ప్రవర్తిస్తున్నారు. కోటవీధిలో వీరభద్ర దేవాలయం దగ్గర పైపు డ్యామేజ్ అయి చాలా రోజులుగా నీరు వృథాగా పోతున్నాయి. సమస్యను పరిష్కరించాలని అధికారులకు తెలిపినా స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ నీరు రోడ్డుపై నిలిచి ఇబ్బందిగా మారింది. కొన్ని నెలలుగా గ్రామంలోని బీరప్ప దేవాలయం దగ్గర ఇదే పరిస్థితి ఉండేది. ప్రజాశక్తి ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు. పలుచోట్ల కుళాయిలకు ఆన్, ఆఫ్ సిస్టం లేక నీరు వృథాగా పోతున్నాయి. కుళాయిలకు నీటిని వదిలిన తర్వాత చాలా సందర్భాల్లో వాటిని బంద్ చేయకుండా నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సాయంత్రం నుంచి ఉదయం వరకు చాలా కుళాయిల ద్వారా నీరు వృథాగా పోతున్నాయి. గ్రామంలోని నీటి సమస్యలపై అధికారులు పర్యవేక్షణ చేసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో ఉన్న విజేత టాలెంట్ ఇంగ్లీష్ స్కూల్‌లో వినాయక చవితి సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి ఆధ్వర్యంలో గురువారం 2, 3, 4, 5వ తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 2వ తరగతి విద్యార్థి శ్రీనిధి, 3వ తరగతి విద్యార్థి కె.భాను, 4వ తరగతి విద్యార్థి సమిత, 5వ తరగతి విద్యార్థి గజేంద్ర మొదటి బహుమతి గెలుచుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు తార, కాలింగ, మహబూబ్ బాషా మాట్లాడారు. విద్యార్థుల్లో దాగు ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు.

రక్తదానం గొప్పది : సర్పంచి సుధాకర్

ప్రజాశక్తి - హోళగుంద

అన్ని దానాల్లోకి రక్త దానం గొప్పదని సర్పంచి సుధాకర్ తెలిపారు. బుధవారం మండలంలోని ఎమ్‌డి.హళ్లి గ్రామంలో సర్పంచి సుధాకర్ ఆధ్వర్యంలో గోపి ఛారిటబుల్ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేవ సామాజిక సేవా సంస్థ కార్యదర్శి విరుపాక్షి స్వామి మాట్లాడారు. రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని తెలిపారు. ఇంగలదహాల్ మల్లి, సుభాన్ మాట్లాడుతూ... ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చని, అందరూ అవగాహన పెంచుకోవాలని తెలిపారు. హెబ్బటం పీరా, లింగంపల్లి సిద్ధ, వెంకటేష్ మాట్లాడుతూ... ప్రతి గ్రామంలోనూ శిబిరాలు నిర్వహించి, గ్రామస్తులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఎమ్‌డి.హళ్లి ఆర్ఎంపి డాక్టర్ మంజు, ఇంగలదహాల్ ఆర్ఎంపి మస్తాన్, పెద్ద గోనెహాల్ ఆర్ఎంపి మహేష్, టిడిపి నాయకులు సుధాకర్, వీరనాగప్ప, హనుమంతు, లక్ష్మన్న, చంద్ర, ఖాదర్ బాషా, శరణ, శీనా, చిన్న స్వామి పాల్గొన్నారు.

టిడిపి బలోపేతమే లక్ష్యం

- టిడిపి మండల అధ్యక్షులు గోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

టిడిపి బలోపేతమే లక్ష్యంగా పని చేస్తానని పార్టీ అధ్యక్షులు ఎస్ఎం.గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మాధవరం గ్రామంలోని స్వగృహంలో టిడిపి ఇన్‌ఛార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డిని, ఆయన సోదరులు మాధవరం మాజీ సర్పంచి ఎన్.రఘునాథ్ రెడ్డిని, మంచాల సొసైటీ ఛైర్మన్ ఎన్.రామకృష్ణారెడ్డిని, యువ నాయకులు ఎన్.రాకేష్ రెడ్డిని, రాజారెడ్డిని, గోపాల్ రెడ్డిని శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షులుగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఇన్‌ఛార్జ్ రాఘవేంద్ర రెడ్డి, రఘునాథ్ రెడ్డి, రామకృష్ణా రెడ్డికి ధన్యవాదలు తెలిపారు. ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా సేవలందించి పార్టీకి, ఇన్‌ఛార్జీకి మంచి పేరు తీసుకురావాలని కోరారు. పార్టీనే నమ్ముకున్న గోపాల్‌రెడ్డికి మండల అధ్యక్ష పదవి రావడం సంతోషంగా ఉందని రాకేష్ రెడ్డి, రాజారెడ్డి తెలిపారు. టిడిపి నాయకులు మల్లేష్, రాఘప్ప, నాగేష్, పవన్, ఈరన్న, డిసి.తిమ్మప్ప పాల్గొన్నారు.


రాఘవేంద్రరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

సర్వేలను వేగవంతం చేయాలి

- జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి

ప్రజాశక్తి- దేవనకొండ

గ్రామ సచివాలయాల్లో ఆధార్, కౌశలం, హౌస్ హోల్డ్ మ్యాప్ సర్వేలను వేగవంతం చేయాలని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని పాలకుర్తి గ్రామాన్ని సందర్శించి, ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఎంపిడిఒ కార్యాలయంలో జిఎస్‌డబ్ల్యుఎస్ నివేదికలపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని సర్వేలను వేగవంతం చేయాలని కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో అధిక వర్షాలకు నీరు చేరి నిల్వ ఉండడంతో అంటువ్యాధులు ప్రబలుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మండలంలో 5 పంచాయతీ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయన్నారు. సర్వేలను పూర్తి చేయని కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ గోపాల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి

మహారాజ శ్రీ కర్నూలు 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం. 608/2023

బి.దర్మా రెడ్డి. ...వాది
- వర్సెస్ -
ఈ. క్రాంతి గౌడ్. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్సు

ఈ.క్రాంతి గౌడ్ తండ్రి ఈ. వేను గౌడ్
ఇంటి.నెం. 8-128-బి, రాజా వీధి,
గూడూరు గ్రామం, మరియు మండలం, కర్నూలు జిల్లా.

పై నంబరు దావాలో వాది, ప్రతివాది నుండి ప్రామిసరీనోటు బాకీ బాపత్తు దావా మొత్తము రూ. 1,32,853/- ముందు వడ్డి, కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఆక్షేపణ ఉన్న యెడల 03-09-2025 తేది, ఉదయం 10.30 గంటలకు మీరుకాని మీ తరపున న్యాయవాది ద్వారా గాని పై కోర్టులో హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకొనవలయును. లేని యెడల సదరు దావా నీ పరోక్షమున విచారించి తీర్మానింప బడునని తెలియజేయడమైనది

కోర్టు వారి ఉత్తర్వు మేరకు
వాయిదా : 03-09-2025

బి. శ్రీకాంత్,
వి. భార్గవ్,
వాది పరం న్యాయవాదులు, కర్నూలు.

IN THE COURT OF THE HADDL DIST JUDGE KURNOOL AT ADONI
O.S No. 54/2012

Between
T. Abdul rasheed. ...Appellant
Vs
T.MD.Haneef Sab (died) by its and others ...Respondantes

NOTICE

3. T. Shamuddin, s/o T. Md. Haneef Sab, muslim, 48 Years, Dina 10/27, Mugathipeta Temmiganur.
4.T. Zamthullah, s/o late T. Md. Md. Haneef SAL, Muslim, 80 years, agriculturist, D.No.10/28 Mugathipeta, Yemmiganur.
5. S.Muneera Bee, D/o late T. Md. Haneef Sab, w/o S. Habeebullah, muslim, 70 years, Pino MIG 200, Housing Board colony, Adors
6.S. Noorjahan Nurun Bee, Dio late T. Md. Haneef Sab, w/o5. Müdin Peera, mm, 6 vears, Hino 51/15A/90, Near Bellary chowrastha, behind IV Town PS. Kurnool
7.S. Rubura liee, Dio late T. Md. Haneef Sah, w/o tate Abdul Salam Sah, muslim, 62 years H.no 4/444, Mantralayam Village and mandal Katun Bee, Dio late 1. Md. Haneef Sab, w/o S. Abdul Hameed, muslim, 55 years no.49/504-877, Lakshmi nagar, Kurnool town.

Please take notice that the above named appellants have preferred the above spoesi against the decree and judgement passed in O.S.No.54/2012 on the file of Junior Civil Jutge yemmaginur and registered in this Court and that the has been fixed by the Court for the hearing03-09-2025 day of of the Appeal. If on appearance is made on your behalf by yourself, your Pleader or by some one by law law authorised to act for you in this appeal it will be heard and decided in your absence Given under my hand and the sale of the Court on this

K. Abdul Rasheed,
D. Savitha Rani,
Advocates, Adon.

పాలనలో తెలుగు భాష అమలుకు నగరపాలక మేనేజర్ కృషి

నేడు తెలుగు బాషా దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ మేనేజర్ ఎన్. చిన్న రాముడుకు తెలుగు భాషపై ప్రత్యేకమైన అభిమానం ఉంది. ఆయన సంతకాలు, తపాలా, మార్గదర్శకాలు, అన్నింటినీ తెలుగులోనే రాస్తారు. నేటి కాలంలో అధికార భాషగా ఆంగ్లం ఎక్కువగా వాడుతున్నా, చిన్నరాముడు మాత్రం తన మాతృభాషకు ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేకత సాధించారు. ఆయన ఈ అలవాటు సహచర ఉద్యోగుల్లోనూ ఒక మార్పు తీసుకొచ్చింది. కార్యాలయంలో పత్రాలు, నోటీసులు తెలుగులో రావడానికి ప్రోత్సాహం లభిస్తోంది. ప్రజలు సులభంగా అర్థం చేసుకునేలా అధికారిక సమాచారాన్ని తెలుగులో అందించడం ఆయన ముఖ్యలక్ష్యం. శుక్రవారం ఈనెల 29న తెలుగు భాషా దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని చిన్న రాముడు చెప్పిన విషయాలు ఆయన మాటల్లోనే.... వ ం న మాతృభాషను వాడటం కేవలం భాషాభిమానం మాత్రమే కాదు. అది మన సంస్కృతికి గౌరవం. అధికారికంగానూ, వ్యక్తిగతంగానూ తెలుగు వినియోగం పెరిగితే, భవిష్యత్ తరాలకు మంచి మార్గం చూపినట్లవుతుంది. తెలుగు భాషపై చూపుతున్న ఈ మక్కువతో చిన్న రాముడు, ఒక అధికారి కృషి ఎంతటి మార్పు తీసుకురాగలదో నిరూపిస్తున్నారు. ఆయన ఆచరణ సహచరులకు ప్రేరణగా, ప్రజలకు ఆదర్శంగా నిలుస్తోంది.

ఓర్వకల్లో విద్యుత్ అమరవీరులకు నివాళులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు మండల కేంద్రంలో గురువారం గ్రామ సచివాలయం ఎదుట వామపక్ష పార్టీలు విద్యుత్ పోరాటంలో చనిపోయిన అమరవీరులకు ప్రతిజ్ఞ చేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి బి.నాగన్న సిపిఐ మండల నాయకులు పి సుధాకర్ ప్రజా సంఘాల నాయకులు రామకృష్ణ, మద్దిలేటి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న విద్యుత్ చార్జీల భారాన్ని వెంటనే తగ్గించాలన్నారు. స్మార్ట్ మీటర్ల విధానాన్ని కూడా రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల నాయకులు శ్రీరాములు, చిన్న మద్దయ్య , అన్నయ్య అనిల్ పాల్గొన్నారు

సైబర్ నేరాల పై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌బిఐ మేనేజర్ బి.లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం కర్నూలు పూలబజార్‌లోని ఉర్దూ బాయ్స్ హైస్కూలులో ఆర్‌బిఐ ఆధ్వర్యంలో డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సొసైటీఫర్‌సోషల్ ట్రాన్స్‌పార్మర్ అధ్వర్యంలో, ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు పర్యవేక్షణ లో నిర్వహించారు. ఎస్‌బిఐ మేనేజర్ బి.లక్ష్మీనారాయణ, కెడిసిసిబి మేనేజర్ పి శిరీష ప్రోగ్రాం కోఆర్డినేటర్ వి అశోక్ కుమార్ , ఇన్చార్జి పాఠశాల హెచ్‌ఎం ఎస్.పుష్పరాజ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్లు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు వై.బాబురావు , ఎస్.నబిరసూల్, ట్రైనర్ వి.పులికొండ, బి.రాముడు నాయక్ పాల్గొన్నారు

పారదర్శకంగా మెగా డిఎస్‌సి

రాష్ట్ర మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రతిపక్ష పార్టీ నేతలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా తమ కూటమి ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేసిందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ అన్నారు. డిఎస్‌సి పోస్టుల భర్తీపై మంత్రి టిజి భరత్ ఒక ప్రకటన విడుదల చేశారు. పారదర్శకంగా మెగా డిఎస్‌సి నిర్వహించామని, ప్రతి ఏటా డిఎస్‌సి నిర్వహించి యువ ఉపాధ్యాయులతో విద్యారంగాన్ని దేశంలోనే తొలి స్థానంలో నిలబెడతామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇడబ్ల్యుఎస్, వికలాంగ అభ్యర్థులకు వయస్సు మినహాయింపు ఇచ్చి వారికీ అండగా నిలబడ్డామని పేర్కొన్నారు. యువత బాగుపడటం ఇష్టంలేని ప్రతిపక్ష నేత మెగా డిఎస్‌సిని ఆపేందుకు 24 కేసులు వేయించాడన్నారు. అవన్నీ తట్టుకొని మెగా డిఎస్‌సి ప్రక్రియను పూర్తి చేసిన ఘనత మంత్రి నారా లోకేష్‌కు దక్కుతుందన్నారు. ప్రభుత్వ విద్యలో విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు గత 14 నెలలుగా సమర్థవంతంగా సంస్కరణలు అమలు చేస్తూ బడులకు నూతన వెలుగులు తెస్తున్నామన్నారు. 2014-2019 మధ్య 2 డిఎస్‌సి జరిపి 18వేల ఉపాధ్యాయ పోస్టులను తెలుగుదేశం ప్రభుత్వం భర్తీ చేసిందని మంత్రి టిజి భరత్ తెలిపారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సమగ్ర శిక్షాసొసైటీ ఆధ్వర్యంలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 729 నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టులను భర్తీ చేసిందన్నారు. 90 మంది ఎస్టీ యువతను కొత్తగా ఉపాధ్యాయులుగా నియమించిందని, 700 కోయభారతి టీచర్ పోస్టులు భర్తీ చేశామన్నారు. జూనియర్ కాలేజీల్లో 700 మంది సిబ్బంది సేవలు పునరుద్ధరణ చేశామన్నారు. 476 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 3619 మంది కాంట్రాక్టు లెక్చరర్ల సేవలు పునరుద్ధరణ చేశామన్నారు. టీచర్లపై పని ఒత్తిడి తగ్గించేందుకు గత ప్రభుత్వంలో ఆరు రకాల బడుల విధానం ఉండగా.. తమ కూటమి

ప్రభుత్వం వాటిని తొమ్మిది రకాల బడులుగా మార్చిందన్నారు. తమ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా వ్యవస్థను గొప్పగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నామన్నారు.

జిఐఎస్, ఐజిఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించాలి

రెవెన్యూ విభాగం సిబ్బందితో సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఇంటిగ్రేటెడ్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్ (ఐజిఆర్ఎస్), జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జిఐఎస్) వివరాల ఆధారంగా ఆస్తి పన్ను మదింపు త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ సిబ్బందిని ఆదేశించారు. గురువారు కర్నూలు ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో రెవెన్యూ విభాగం సిబ్బంది, అడ్మిన్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ఆస్తి పన్ను మదింపు ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకతను సాధించడానికి ఆధునిక సాంకేతిక పద్ధతులను వినియోగించాలన్నారు. ఇందుకోసం ఐజిఆర్ఎస్ (ఇంటిగ్రేటెడ్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్) ద్వారా రిజిస్ట్రేషన్ల ఆధారంగా ఆస్తి వివరాలను పునః పరిశీలించి, ఆస్తి పన్నును సవరించాలన్నారు. జిఐఎస్ (జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) ద్వారా భౌగోళిక సమాచారం, స్థల వివరాలు సమన్వయం చేసి ఆస్తి మదింపులో తప్పులు రాకుండా చూడాలని సూచించారు. రెవెన్యూ సిబ్బంది ఈ పద్ధతులపై పూర్తి అవగాహనతో కర్తవ్యనిష్ఠతో పనిచేయాలని ఆదేశించారు. నగర ఆదాయం పెరగడానికి ప్రతి ఆస్తి సరిగ్గా రికార్డు చేయాలని, పన్ను వసూళ్లు సమర్థంగా జరగాలని స్పష్టం చేశారు. నగరంలో సుమారు 8 వేల దరఖాస్తులు ఉన్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గతంలో వేలంపాటకు పెట్టినప్పటికీ ముందుకు రాని దుకాణాల విషయమై చర్యలు తీసుకోవాలని, వాటికి మరమ్మతులు, వసతులు కల్పించి మళ్లీ వేలంపాటకు పిలవాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివికృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఆర్‌ఓ జునైద్, వాజీద్, ఆర్‌ఐలు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతన్న కమిషనర్ విశ్వనాథ

స్మార్ట్ మీటర్లు వ్యతిరేకంగా గూడూరులో నిరసన

ప్రజాశక్తి-గూడూరు

విద్యుత్ పోరాటాల అమరవీరుల స్ఫూర్తితో గురువారం గూడూరు స్థానిక పాత బస్టాండ్ ఆవరణలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథి సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి జె. మోహన్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అలంబిస్తున్న విద్యుత్ సంస్కరణలకు స్మార్ట్ మీటర్లు వ్యతిరేకంగా పోరాడుతామన్నారు. ఈనెల 28వ గతంలో నాటి రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలకు చేసి విద్యుత్ ఛార్జీలు పెంచడానికి ప్రయత్నాలు చేస్తే విద్యుత్ సంస్కరణకు వ్యతిరేకంగా హైదరాబాదులో బషీరా బాద్ లో వామపక్ష పార్టీలు అధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు జరిగాయన్నారు. ఆ పోరాటాల్లో ముగ్గురు రామకృష్ణ , బాలస్వామి , విష్ణువర్ధన్ రెడ్డి మరణించారని, నేటికీ 20సంవత్సరాలు వరకు ఏ ప్రభుత్వాలు కూడా విద్యుత్ సంస్కరణలు చేయడానికి సహించలేదన్నారు. గత ప్రభుత్వం వైసిపి ప్రభుత్వం ట్రూ యాప్ చార్జీలు ఇలా రకరకాల చార్జీల పేరుతో ప్రజలపై అధిక విద్యుత్ వారాలు వేసి వసూలు చేసిందని, ఈ విద్యుత్ బారాల వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని దీంతో పాటు ఆదాని కంపెనీతో ఒప్పందం చేసుకొని విద్యుత్తులను ఆదాని కంపెనీకి ప్రైవేట్ వరం చేయడానికి పూనుకుందన్నారు. అందులో భాగంగా స్మార్ట్ మీటర్లకు బిగించడానికి ప్రయత్నాలు చేసిందని, అందుకే ప్రజలు వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి పంపారని, నేడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా విద్యుత్ చార్జీలను పెంచదేమోనని ఆశపడ్డ ప్రజలకు అడియాశలే మిగిల్చిందన్నారు. ఈ కూటమి ప్రభుత్వం కూడా విద్యుత్తులను ఆదాని కంపెనీకి అప్పగించడానికి ప్రయత్నిస్తుందని అందులో భాగంగానే విద్యుత్ స్మార్ట్ మీటర్లకు ఇండ్లకు బిగించడానికి ప్రయత్నాలు చేస్తుందన్నారు. ప్రభుత్వాలు మారిన ప్రజలపై విద్యుత్ ద్వారాలు మాత్రం తగ్గడం లేదని, ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీలు తగ్గించి స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలన్నారు. లేక పోతే 2000 సంవత్సరాల్లో విద్యుత్ సంస్కరణ వ్యతిరేకంగా పోరాటంలో మరణించిన అమరవీరుల పోరాట స్ఫూర్తితో సిపిఎం ప్రజలకు ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దానమన్న ,కొమ్మురాజు ,కప నాగేష్ ,సురేష్, చిన్న రాజు హమాలీ సంఘం నాయకులు చిరంజీవి, పెద్ద సుధాకర్ ,ప్రభుదాస్ , ఏసేపు అబ్రహం , చిన్న సుధాకర్ సురేష్ కోలా రవి, డేవిడ్ తదితరు కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వినాయక చవితి పురస్కరించుకొని ... కలెక్టరేట్‌లో సమాచార శాఖ కార్యాలయంలో జర్నలిస్టుల ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పాత్రికేయ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మట్టితో తయారు చేసిన వినాయకుని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. జర్నలిస్టులు నీలం సత్యనారాయణ, విజయ్ కుమార్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమానికి విగ్రహ దాత ఆంధ్రఅక్షర అధినేత మహబూబ్ బాషాకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాత్రికేయ బృందం దండు విద్యాసాగర్, కె.శ్రీనివాసులు, మంజునాథ్, ప్రకాష్, సాయికుమార్ నాయుడు, వి.విజయ్ కుమార్, కిషోర్, గంగాధర్, పరమేష్, రాఘవేంద్ర, ఆయా సంస్థల జర్నలిస్టులు,కెమెరామెన్లు పాల్గొన్నారు.